నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ చీఫ్ఇంజనీర్ ఆదేశానుసారం ప్రాజెక్టు అధికారులు ఈ నెల 4 నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. 3000 క్యూసెక్కుల నీటినివారం రోజులపాటు విడుదల చేసి శుక్రవారం ఉదయం ఆపివేశారు.ఈ నీటిని పాలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలకు తాగునీటి అవసరాల నిమిత్తం విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.
ప్రజాపక్షం/నందికొండ





# జనవరి నాటికి 5వ యూనిట్ పనులు పూర్తి

## రాష్ట్ర ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 5వ యూనిట్ పనులను 2026 జనవరి నాటికి పూర్తి చేసి విద్యుత్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను రాష్ట్ర జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీష్‌తో కలిసి సందర్శించారు. పవర్ ప్లాంట్‌లోని ఉత్పత్తి యూనిట్, ప్లాంట్‌కు బొగ్గు సరఫరా, కూలింగ్ టవర్లు, స్విచ్‌యార్డు తదితర యూనిట్లను ఆయన పరిశీలించారు. వన మహోత్సవం సందర్భంగా ప్లాంట్ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం వైటీపీఎస్ సమావేశ మందిరంలో ప్లాంట్ ఇంజనీరింగ్ అధికారులు, బీహెచ్‌ఈఎల్, జెన్‌కో అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జనవరి నుంచి విద్యుత్‌కు ఏర్పడే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకోని అనుకున్న సమయం కంటే ఒక నెల ముందుగానే 5వ యూనిట్ పనులను పూర్తి చేసి విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి పర్యావరణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, టౌన్‌షిప్ పనులు నిర్ధేశించిన సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే సివిల్ పనులపై సైతం ప్రత్యేక దృష్టికి నిలపాలని, ప్రాజెక్టు పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని, ప్రతి పనిలో నాణ్యతను అభివృద్ధి చేసే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. తక్కువ ధరకు బొగ్గును తీసుకునే విధంగా అధికారులు మార్గాలను అన్వేషించాలన్నారు. ప్లాంట్ పరిధిలో ఎక్కువ మొక్కలను నాటాలని సూచించారు. అదేవిధంగా జెన్‌కో సీఎండి డాక్టర్ ఎస్.హరీష్ మాట్లాడుతూ వైటీపీఎస్‌కు వచ్చే రోడ్లు, అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని, ఆర్‌అండ్‌బి శాఖ ద్వారా నిర్మిస్తున్న రహధారి భూసేకరణను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, ప్రాజెక్టు ఆవరణలో ఉన్న స్ర్పాన్‌ను తొలగించాలని, బీహెచ్‌ఈఎల్ అదనపు సిబ్బందిని నియమించి 5వ యూనిట్‌ను నిర్ధేశించిన సమయం కంటే ముందే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోని రైల్వే పనులను చేపట్టాలని, 2047 విజన్‌ను దృష్టిలో ఉంచుకోని ప్రత్యామ్నాయ బొగ్గు మెకానిజాన్ని రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు, బీహెచ్‌ఈఎల్ పవర్ డైరెక్టర్ జితేందర్‌గుప్తా, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నాగయ్య, అజయ్, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాస్‌రావు, సురేష్, వినోద్, జాకబ్ పాల్గొన్నారు.

## విద్యుత్ ఉత్పత్తి నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకునేలా కృషి చేయాలి

**ప్రజాపక్షం/నందికొండ:** భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తి నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకునేలా ఇంజనీరింగ్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ అన్నారు. శుక్రవారం అయన రాష్ట్ర జెన్ కో సిఎండి డాక్టర్ ఎస్. హరీష్, నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి లతో కలిసి నాగార్జునసాగర్ వద్ద ఉన్న జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు.జల విద్యుత్ కేంద్రంలోని యూనిట్లన్నింటిని, విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను, పవర్ హౌసును పరిశీలించిన అనంతరం జెన్ కో పవర్ హౌస్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.భవిష్యత్తులో జల విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ,ఇందుకు గాను అవసరమైతే పంపులను సోలార్ పై నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు.నాగార్జున సాగర్ జల విద్యుత్ కేంద్రం ద్వారా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టాలని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఎలాంటి నిర్వహణ లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాగార్జునసాగర్ జల విద్యుత్ కేంద్రం సి ఈ మంగేష్ కుమార్ నాగార్జునసాగర్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వివరాలను తెలియజేశారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ ,హైడల్ డైరెక్టర్ ,ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

# పట్టణాలను తలపిస్తున్న పల్లెలు...

## మారుతున్న పల్లెల తీరు



**ప్రజాపక్షం/గుండాల;** ప్రత్యేకతను సంతరించుకున్న తెలంగాణ పల్లెల తీరు క్రమేపి మారుతుంది. దశాబ్దా కాలంగా పల్లెలోకి వెళితే బస్తీకి, పల్లెకు తేడా కనిపించడం లేదు. గల్లిలోను సిమెంట్ రోడ్లు, పెద్ద పెద్ద భవనాలు అందులో ఏసిలు, అందమైన ప్రహరీ గోడలు, ఖరీదైన వాహనాలతో పట్టణాలతో పోటీ పడుతున్నాయి. తెల్లవారు జామున పల్లెల్లో కోడ కూతలు మచ్చుకు కూడా వినపడని పరిస్థితి, ఇండ్లలో కోళ్లను పెంచితే చికాకు అన్న భావన పెరగడంతో కోళ్ల పెంపకం లేకుండా పోయింది. గతంలో రైతులకు కోళ్ల పెంపకం అనుబంధంగా ఆదాయాన్ని తెచ్చి పెట్టేది, పశు సంపద ఇప్పుడు రైతులకు భారంగా మారిన పరిస్థితి పల్లెల్లో నేలకొంది. దశాద్ధ కాలం క్రితం తెల్లజాతి పశువులను తగ్గించి గేదేలు పెంచడాన్ని కొనసాగించిన రైతులు ఇప్పుడు వదిలేసే పరిస్థితి. డబ్బులు ఉంటే రైతులు వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి దానిని గర్వంగా భావించే వారు ఇప్పుడు భూముల ధరలు పెరగడంతో వ్యవసాయం చేసే వారి సంఖ్య తగ్గడంతో పట్టణ ప్రాంతాలలో ఇండ్ల స్థలాలు కొనుగోలు చేయడంపై దృష్టి సారించారు. పట్టణంలో ఇంటి స్థలం ఉండడం స్టేటస్‌గా మారడం, పట్టణంలోని భవనాలను తలదన్నే రీతిలో పల్లెల్లో ఇండ్లను నిర్మిస్తున్నారు. పల్లెల్లో ఇళ్ళు, ఇంటి ముందు కారు, ద్విచక్ర వాహనాలు లేని ఇండ్లు లేవంటే అతిశేయేక్తికాదు. గడిచిన మూడు దశాబ్దాలుగా పెరిగిన విద్యా అవకాశాలతో గ్రామీణ ప్రాంతాలలోని యువత విద్యా వంతులుగా ఎదగడం ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడడంతో గ్రామీణ ప్రాంతాలలో కూడా మార్పులు వచ్చాయి. పల్లె జీవన విధానం ఆహార వ్యవహారాల్లో కూడా మార్పులు వచ్చాయి. పల్లెల్లో ఆత్మీయ పలకరింపులు కరువయ్యాయి. ఎవరిండ్లల్లో వారు ఉంటూ పల్లెల్లో రచ్చబండలు బోసిపోయిన పరిస్థితులు పల్లెల్లో [illegible]

# కోతులతో కోటి తిప్పలు....

## ఇళ్లలోకి చొరబడి బీభత్సం

## నియంత్రణ చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

**ప్రజాపక్షం/నందికొండ:** ఇది ఒకరి సమస్య కాదు ఉరందరిని తీవ్ర ఇబ్బంది పెడుతున్న సమస్య. వనాల్లో ఉండాల్సిన వానరాలు జనావాసాల్లోకి చేరి గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి చేస్తున్నాయి. నందికొండ మున్సిపాలిటీలో కోతుల బెడద రోజురోజుకు పెట్రేగి పోతుంది ఎక్కడ చూసినా కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి చేస్తున్నాయి. ఇళ్లలో,దుకాణాల్లో తినుబండారాలు, వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి, కూరగాయలు, పండ్ల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి కోతుల భయంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు ఇళ్లలోకి చొర బడి ఆహార పదార్ధాలు వస్తువులు చిందర వందర చేస్తున్నాయి కిరాణ షాపులు, పండ్ల దుకాణ దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు షాపులోని వస్తువులకు రక్షణగా జాలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కోతుల బెడదతో రేకుల ఇళ్లు ధ్వంసమవుతున్నాయి. ఆరు బయట ఎండబెట్టిన పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాలనూ కోతులు వదలడం లేదు. ఇళ్లలో ఉన్న మామిడి, జామ, బొప్పాయి, ఇతర పండ్ల చెట్లు, కూరగాయల చెట్లను, దేన్నీ కోతులు వదలకుండా ధ్వంసం చేస్తున్నాయి.

**దాడులతో భయాందోళనలో ప్రజలు...**



కోతుల బెడద రోజు రోజుకు ఎక్కువ కావడం అవి కనిపించిన ప్రతి ఒక్కరి మీద దాడులతో తెగబడడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లలో చొరబడి వీరంగం సృష్టిస్తున్న కోతులను తరిమే ప్రయత్నంలో ఎదురు తిరిగి దాడి చేసి గాయపరుస్తున్నాయి. బాటసారులు చాలా మంది కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కోతుల నియంత్రణకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని, కోతులను బందించి అటవీ ప్రాంతాలకు తరలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తాము చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాటి నియంత్రణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కోతుల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కాలనీ వాసులు మొరపెట్టు కుంటున్నారు.

## ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** జిల్లా కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో గుమస్తాగా పనిచేసిన జనార్ధనచారి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుమార్తె కన్నోజు సిరిచందన ప్రతిభా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతొంది. చదువుకు భారం కావడంతో జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి చల్లా లక్ష్మి కాంత్‌ను సంప్రదించడంతో శుక్రవారం ఆయన ఐదువేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి కాంత్ మాట్లాడుతూ బాధ్యతగా పేదవారికి తమ వంతు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## యూరియా నిల్వలు ఉన్నాయి

**ప్రజాపక్షం/సూర్యాపేట:**మండలంలో రైతులకు సరిపడా యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు మండలంలోని ఆకుపాముల, మునగాల, తాడ్వాయి, కొక్కిరేణి సహకార సంఘాలతో పాటు ప్రైవేట్ దుకాణాలలో మొత్తం 7097 బస్తాల యూరియా ప్రస్తుతం అందుబాటులో ఉన్నట్లు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం వరి నారుమడి దశలో ఉన్నందున సరిపడా యూరియాను కొనుగోలు చేయాలని, రైతులు యూరియాను అధికంగా వాడటం వల్ల భూమి దెబ్బతిని, వాయు కాలుష్యం, నీటి కాలుష్యం జరిగి ఆరోగ్య సమస్యలతో పాటు ముమ్ముందు పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

## గంధమల్ల రిజర్వాయర్ సర్వే పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో రిజర్వాయర్ సర్వే పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వే పనులను జిల్లా అధికారులు, తహసిల్దార్ దేశ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్కు కావలసిన 1000 ఎకరాలకు ఒక్క ఎకరానికి రూ.24 లక్షల 50 వేల పరిహారాన్ని రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ ప్రధాన కార్యదర్శికి అభినందనలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఏఐసీసీ ప్రధానకార్యదర్శి సంపత్ కుమార్ యాదాద్రి భువనగిరి కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి గా నియమితులైన సందర్భంగా జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయనను మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కలిసి అభినందనలు తెలిపి భూదాన్ పోచంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్‌కు రాష్ట్ర షీప్ & గోట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతూ జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవ రెడ్డి జిల్లా నాయకులు మలిపెద్ది అంబరీష్ రెడ్డి, గోరంటి శ్రీనివాస్ రెడ్డి, మన్నెం వెంకట్ రెడ్డి, ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, జంగయ్య యాదవ్ వినతి పత్రాన్ని సమర్పించారు.



## అధిక జనాభా అనర్థాలకు మూలం




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** అధిక జనాభా అనర్థాలకు మూలమని మండల వైద్యాధికారి డాక్టర్.వేణుగోపాల్ నాయక్ అన్నారు. శుక్రవారం జనాభా దినోత్సవం సందర్భంగా లింగగిరి పిహెచ్‌సి ఆధ్వర్యంలో లింగగిరిలో ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డా.వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ జనాభా వృద్ధి వలన ఆర్థిక అసమానతలు,నిరుద్యోగం పెరిగి ఆహార కొరత ఏర్పడుతుందన్నారు. కుటుంబ నియంత్రణ అనేది జనాభా నియంత్రణ మాత్రమే కాదని మహిళల ఆరోగ్యంతో పాటు దంపతులు కూడా తమ జీవితాలలో సంతోషంగా ఉండటమేకాక,ఎటువంటి ఆర్థిక ఇబ్బందులకు ఎదుర్కోకుండా,ఆరోగ్యంగా గడపడానికి అవసరమైన స్వేచ్ఛనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పద్మ,పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్లు నూర్జహాన్ బేగం,నర్సింగ్ ఆఫీసర్ రత్నమేరీ,సూపర్‌వైజర్ పద్మ,ఇందిరాల రామ కృష్ణ,ఉదయగిరి శ్రీనివాస్,ల్యాబ్ టెక్నిషియన్ రమేష్,ఆరోగ్య సిబ్బంది,ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్ల తీర్మాణంపై హర్షం



**ప్రజాపక్షం/కోదాడ:** బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని పలువురు బిసి సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని పెరిక కళ్యాణ మండపంలో విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు కోసం మంత్రివర్గం తీర్మాణంచేసి అర్డినెన్స్ తీసుకరావడానికి నిర్ణయించడం పట్ల హార్షం వ్యక్తం చేశారు. బిసి సంఘం డివిజన్ అధ్యక్షులు కాసాని శివ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ సభలో, జోడోయాత్రలో తమ నాయకుడు రాహుల్‌గాంధీ జనాభా ప్రకారం తొలిసారిగా తెలంగాణలో అమలు చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. బిసిల సామాజిక న్యాయనికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి బిసిలు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు బాషబోయిన భాస్కర్, ఈదుల కృష్ణయ్య, కందుల కోటేశ్వరరావు, రామినేని శ్రీనివాసరావు, చింతలపాటి శ్రీనివాసరావు, పుల్లూరి అచ్చయ్య, బడేటి వెంకటేశ్వర్లు, మూసి శ్రీనివాస్, నక్క చంద్రం, బుడిగెం నరేష్, చిలక రమేష్, పిట్టల లక్ష్మయ్య, మట్టయ్య, వీరబాబు పాల్గొన్నారు.

## అండర్ డ్రైనేజీ నిర్మాణం, సిసి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులతో మంజూరైన 15లక్షల రూపాయల అండర్ డ్రైనేజీ నిర్మాణం సిసి పనులకు సోమవారం శంకుస్థాన చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,బంగారిగడ్డ మాజీ ఎంపిటిసి పల్లె వెంకన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏఎంసి డైరెక్టర్ నల్పరాజు రామలింగయ్య , ఏఎంసి డైరెక్టర్ తలారి నర్సింహ్మా, మాజీ జడ్‌పిటిసి మాదగోని విజయలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు బోయపల్లి జంగయ్య , బోయపల్లి భిక్షమయ్య, పంచాయితీ కార్యదర్శి ఏరుకొండ కోటి , పల్లె యాదయ్య, ఇరిగి రాజు, పల్లె శంకరయ్య, బోయపల్లి సైదులు , సుంకరి నర్సింహ్మా,చెన్నయ్య , యాదయ్య ,బోయపల్లి శివలింగయ్య , పల్లె మల్లేశం , బొడ్డు ముత్తయ్య , ప్రభాకర్ , నర్సింహ్మా, టి.ముత్తయ్య , సాల్మన్, వెంకటేశం పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలి




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని హుజూర్‌నగర్ మున్సిపల్ కమీషనర్ కె. శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలలో భాగంగా మున్సిపాలిటీ కార్యాలయం నుండి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు భారీ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులచే నృత్య ప్రదర్శన నిర్వహించారు, రంగస్థల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ కళా బృందంతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ పట్టణ ప్రధాన రహదారిపై నృత్య నాటిక,కళారూపాలు ప్రదర్శించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాల గురించి,తడిచెత్త,పొడిచెత్త వేరు చేయడం వంటి అంశాలపై కళాకారులు ప్రదర్శన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా కమీషనర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజలు,వ్యాపారస్తులు ప్లాస్టిక్‌ను వాడకుండా ఉండటం వలన పర్యావరణాన్ని పరిరక్షించినవారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఎమ్. అశోక్,కార్యాలయ సిబ్బంది,ఉపాధ్యాయులు,విద్యార్థులు,వివేక్ డ్యాన్స్ అకాడమీ తదితరులు పాల్గొన్నారు.



## పెన్షన్ సదస్సును విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/మోతె:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో వృద్దులు, వితంతువులు, వికలాంగులకు, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు పెన్షన్లు వెంటనే పెంచాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వికలాంగుల మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 14న పద్మశ్రీ అవార్డు గ్రహిత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే పెన్షన్ సమావేశంలో వికలాంగులు, వృద్దులు, ఒంటరి మహిళ, బీడి కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వికలాంగుల నాయకులు కొల్లురు ఈదయ్యబాబు, సుధాకర్, నర్సయ్య, దున్నపోతుల కార్తీక్, బులికొండ వెంకన్న, తురక నాగమ్మ పాల్గొన్నారు.

## సామాజిక విప్లవానికి నాంది



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** బిసిలకు 42శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్ననిర్ణయం చారిత్రాత్మకమని ఓబిసి సెల్ పట్టణ అధ్యక్షులు రావుల రాంబాబు, టౌన్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అంజద్‌అలీలు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మహ్మాత్మా గాంధీ జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద ఏఐసిసి దేశ అగ్రనేత రాహుల్‌గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, మాజీ కౌన్సిలర్లు గండూరి రమేష్, అనంతుల యాదగిరి, రాపర్తి శ్రీనివాస్, సిరివెల్లి శభరినాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, కుమ్మరికుంట్ల వేణు, నాగుల వాసు, రుద్రంగి రవి, గడ్డం వెంకన్న, ఆలేటి మాణిక్యం, అన్నమయ్య రాము, నాగరాజు, సాయి పాల్గొన్నారు.

## ఒక్కరే ముద్దు... ఇద్దరే హద్దు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** చిన్న కుటుంబం చింత లెని కుటుంబం, ఒక్కరే ముద్దు ఇద్దరు హద్దు అని మోటకొండూర్ ప్రాథమిక ఆరోగ్యం వైద్యాదికారి డాక్టర్ విజయ్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా పిహెచ్‌సి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పిహెచ్సి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ మాట్లాడుతూ పరిమిత కుటుంబం అపరిమిత ఆనందం, అధిక జనాభా అనర్థాలకు మూలం, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం, అధిక జనాభా పెరుగుదల మానవ ప్రగతికి అరుగుదల, బిడ్డ బిడ్డకు ఎడం తల్లి బిడ్డకు వరం అని అన్నారు. అధిక జనాభా వలన కూడు, గూడు, గుడ్డ, విద్యా ఉద్యోగం వంటి అనేక అంశాలకు ఇబ్బంది పడే అవకాశం ఉంటుందని మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్ తెలిపారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెచ్ఈఓ నరసింహ, సూపర్వైజర్ అంజుమ్, సందీప్, సురేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





## ప్రజా పాలనలో ఇందిరమ్మ రాజ్యం

**ప్రజాపక్షం/డిండి;** ప్రజా పాలనలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల కలలు సాకారమవుతున్నాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జర్పుల లక్ష్మీ తిరుపతినాయక్ అన్నారు. శుక్రవారం ఎంఎల్ఏ బాలునాయక్ ఆదేశానుసారం ప్రతాప్‌నగర్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రంతో పాటు ఇల్లు నిర్మాణంకై భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో డిండి మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గణేష్, కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు మధుసూధన్‌రెడ్డి, లాలు, రంగయ్య, చెన్నయ్య, అర్జునయ్య, యువ నాయకుడు బాలకృష్ణ, లోక్య, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చెరువు కాపాడిన శ్రీనివాస్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని వెంకటాద్రిపాలెంలో కబ్జాలో ఉన్న కానుగకుంట చెరువు ఆక్రమణకు గురికాకుండా మూడు సంవత్సరాలు పోరాటం చేసి కాపాడిన దాసరాజు శ్రీనివాస్‌ను శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానుగుకుంట చెరువు 16 ఎకరాలు ఆక్రమణకు గురికాగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ మూడు సంవత్సరాలుగా పోరాటం చేయడంతో అధికారులు సర్వే చేయగా ఆక్రమణకు గురైందని తేల్చారని అన్నారు. చెరువు కబ్జా నుంచి కాపాడిన శ్రీనివాస్ పోరాటం గొప్పదన్నారు. యువత అన్యాయాన్ని, అక్రమాలను ప్రశ్నించడంలో ముందుండాలన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/వలిగొండ :** నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని వలిగొండ మండల తాహసిల్దార్ జి దశరథ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వేములకొండ లోతుకుంట పరిధిలోగల మూసి వాగులు ఆయన తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఇసుక నింపుతున్న ట్రాక్టర్ యజమానుల వద్ద అనుమతి పత్రాలను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. కచ్చితంగా ట్రాక్టర్లకు అనుమతి పత్రాలు ఉండాలని డ్రైవింగ్ లైసెన్స్ గల డ్రైవర్లు, వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ కలిగి ఉండాలని ఉదయం 10 గంటల నుండి నాలుగున్నర గంటలలోపు ఇసుక రవాణా చేయాలని రాత్రి వేళలో అక్రమఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఐలాపురం నాగేష్, ఆయా గ్రామల రెవెన్యూ అధికారులు, గ్రామపంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



## 15న సిపిఐ జిల్లా 23వ మహాసభ



**ప్రజాపక్షం/డిండి;** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నల్గొండ జిల్లా 23వ మహాసభలు ఈనెల 15న దేవరకొండ పట్టణంలోని మందడి నర్సింహారెడ్డి ప్రాంగణం సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో జరగనున్నాయి. ఈ మహాసభను విజయవంతం చేసేందుకు శ్రేణులు తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. శుక్రవారం డిండి మండల కార్యవర్గ సమావేశం జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన వెంకటరమణ మాట్లాడుతూ మహాసభ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఐ వందేళ్ల ప్రస్దానంలో చేసిన ఉద్యమాలు పోరాటాలు ఆయన గుర్తుచేశారు. అనంతరం జిల్లా మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి.మైనోద్దిన్, డిండి మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి శైలేష్, కార్యవర్గ సభ్యులు కేశవులు, వెంకటేశ్వర్లు, శ్రీనయ్య, నవీన్ లు పాల్గొన్నారు.

## అభిషేక్ నాయక్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** బిఆర్ఎస్ యువ నాయకుడు ఇస్లావత్ అభిషేక్ నాయక్ 24వ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని చౌరస్తాలో పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆయనకు గజ మాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈవేడుకలలో దేవరకొండ మాజీ ఎంఎల్ఏ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని అభిషేక్‌నాయక్‌కు బోకేలు ఇచ్చి ఆశీర్వదించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి అభిషేక్‌నాయక్ భారీ కేక్ కట్ చేసి, పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు రమావత్ తులసిరామ్‌నాయక్, రమావత్ దీప్‌లాల్‌నాయక్, షేక్ ఇస్మాయిల్, నేనావత్ శంకర్‌నాయక్, బషీర్, హరికృష్ణ, పంగ లాలయ్య, రమేష్‌నాయక్, హబీబ్, వెంకటేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపూజోత్సవం వేడుకలు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** బిజేపి పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని శ్రీరామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజేపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు హాజరై ఆలయ అర్చకులు రెంటాల సతీష్‌కుమార్‌శర్మ, దుర్గప్రసాద్ శర్మ, ఎల్లంబట్ల రమేష్‌శర్మ, కె.బాబ్జి శర్మ, కొండపల్లి సురేష్ లనుశాలువాలతో సత్కరించి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంకినేని వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రతి రంగంలో ఉన్నత స్థాయిలో ఉండి మనకు జ్ఞానాన్ని జీవన విలువలను అందించే ప్రతి ఒక్కరూ గురువులతో సమానమని, సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందిస్తునన అర్చకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, జిల్లా ఉపాధ్యక్షులు సలిగంటి వీరేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు చల్లమల్ల నర్సింహా, పోలగాని ధనుంజయగౌడ్, ఎండి అబీద్, సంద్యాల సైదులు, సైదిరెడ్డి, తాళ్లపల్లి మధు పాల్గొన్నారు.

## నాలా అక్రమ కట్టడం నిలిపివేయాలని వినతి

### నాలా ఆక్రమణ అరికట్టాలని కాలనీ వాసుల వినతి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం లోని వలిగొండ రోడ్డు లో సర్వే నంబర్ 176 లోని నాలా ఆక్రమణలు అడ్డుకుని రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కేంద్రం లోని 13 వ వార్డు రాంనగర్ కాలని వాసులు స్థానిక మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాలని వాసులు మాట్లాడుతూ వలోగొండ రోడ్డు లోని నాలా కల్వర్టు వద్ద కొందరు అక్రమ నిర్మాణం చేపడుతున్నారని ,ఆ నిర్మాణాల వల్ల భవిష్యత్తు లో బారి వర్షాల కారణంగా రాంనగర్ ,శాంతి నగర్ కాలనీలు మునిగిపోయే ప్రమాదం పొంచి ఉందని గతం లో భారీ వర్షాల వల్ల కాలనీలు పూర్తిగా నీటి తో నిండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని పునరావృతం కాకుండ భవిష్యత్తు దృష్టి లో పెట్టుకుని కాలని వాసులను ముంపు నుండి రక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు.ప్రభుత్వం కూడా ఎఫ్టి ఎల్ , బఫర్ జోన్ పరిధిలో కట్టడాలకు ఇరిగేషన్ అధికారుల నుండి ఎన్ ఓ సి తీసుకోవాలని ఉన్నా కబ్జా దారులు ప్రస్తుత ప్రభుత్వం నుండి తీసుకోకుండా గత ప్రభుత్వం లో అక్రమంగా తీసుకున్న అనుమతులు చూపుతూ ప్రజలను ,అధికారులను తప్పు దోవ పట్టిస్తున్నారని సమగ్ర విచారణ జరిపి అట్టి అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేసి ముంపు నుండి కాలని వాసులను రక్షించాలని వినతి పత్రం లో కోరారు. ఈ కార్యక్రమంలో కడం వెంకటేష్, కళ్లెం నాగరాజు గౌడ్, తూర్పునూరు లింగస్వామి గౌడ్, చెవ్వగొని మహేష్ గౌడ్, చెరుకు లింగస్వామి, మార్గం లింగస్వామి , సందగళ్ల నాగరాజుగౌడ్, బండ్ల రామకృష్ణ ,మారగోని ప్రవీణ్, మోగుదాల రాకేష్, మలిగే మహేష్, ఊదరి రాకేష్, ఊదరి మహేష్, పాల కుర్ల రమేష్ గౌడ్ తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.





## గ్రామ గ్రామాన ఎఐవైఎఫ్ జెండా

**ప్రజాపక్షం/డిండి;** అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) డిండి మండల సమావేశం శుక్రవారం డిండి సిపిఐ ప్రజా భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సిపిఐ డిండి మండల కార్యదిర్శి శ్రీరామదాసు కనకాచారి మాట్లాడుతూ యువతను చైతన్య పరచాలని గ్రామాల్లో డ్రగ్స్ మహమ్మారి విస్తరిస్తున్న నేపథ్యంలో యువతను చైతన్యం చేసేందుకు గ్రామాలకు ఏఐవైఎఫ్ నాయకులు వెళ్ళి ప్రతి గ్రామంలో కమిటి వేసి జెండాలను ఎగరవేయాలని సూచించారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ మాట్లాడుతూ యువజన సమాఖ్య బలోపేతం కోసం అన్ని గ్రామాల్లో నూతన కమిటిలను ఎన్నుకోని పోరాటాలకు సిద్దం కావాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, మహేష్, కోశాధికారి మధుకర్, ఆదిల్, ప్రవీణ్, గోవర్ధన్, సాయికుమార్, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్లపై కేసు నమోదు



**ప్రజాపక్షం/ చింతపల్లి :** పేకాట ఆడుతూ ఐదుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడిన సంఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు మండల పరిధిలోని వింజమూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల పై ఎస్సై తన సిబ్బందితో రైడ్ చేశారు. ఈ రైడ్‌లో ఐదుగురు వ్యక్తులు పట్టుబడగా, వారి వద్ద నుండి నాలుగు మోటారు సైకిల్‌లు, నాలుగు సెల్ ఫోన్లు, 12200 రూపాయల నగదు స్వాధినం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు రామ్మూర్తి తెలిపారు. ఎవరైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అడ్‌హాక్ పద్ధతిలో కల్పించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో ఖాళీలుగా ఉన్న అన్ని రకాల పోస్టులను అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతులు కల్పించి భర్తీ చేయాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాక్ కోరార. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో పర్యవేక్షణ పోస్టులు పూర్తిగా ఇన్‌చార్జిలతో కొనసాగిస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 30 జిల్లా విద్యాశాఖాధికారి, 58 డిప్యూటీ విద్యాశాఖాధికారి, 830 ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. అదేవిధంగా ఆయా కళాశాలల్లో ఖాళీగా ఉన్న అద్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. సీఎం ఆదీనంలో ఉన్న విద్యాశాఖలో ఖాళీలు లేకుండా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినందున వెంటనే అన్నిరకాల పదోన్నతులు కల్పించా లన్నారు. గోపి, మక్లనాయక్, సైదానాయక్, జామ్లు, మోతీలాల్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

## శాలివాహనులు బోనాలు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామం శివారులోని శ్రీ శ్రీ ఆందోల్ మైసమ్మ దేవాలయంలో ఈ నెల 13న 20 బోనాల బ్రహ్మోత్సవాల ఉత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం శాలివాహనులు మొదటి బోనాలు అమ్మవారికి సమర్పించారు.మహిళలు బోనాలతో దేవాలయం వద్ద ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి నైవేథ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం అధ్యక్షులు వెంకటేష్, రామలింగేశ్వర దేవాలయం చైర్మన్ మల్కాజిగిరి బాబు, మాజీ ఉపసర్పంచ్ మల్కాజిగిరి కృష్ణ పాల్గొన్నారు.

# ఇద్దరు దొంగలు అరెస్ట్...

## నాలుగు బైకులు, రెండు సెల్‌ఫోన్లు, 8 పుస్తెలతాడులు స్వాధీనం





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఒంటరిగా వెళ్తున్న మహిళలలను టార్గెట్ చేస్తూ వారి మెడలో నుండి బంగారు పూస్తేల తాడులను ఎత్తుకెళ్తున్న దొంగలను నల్లగొండ పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి కేసు వివరాలు వివరించారు నిందితులు లిఫ్ట్ టెక్నిషియన్ గా పనిచేస్తున్న త్రిపురారం మండలము నీలాయిగూడెం గ్రామానికి చెందిన రావిరాల పవన్ ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి గ్రామములో నివాసం, డ్రైవర్‌గా పనిచేస్తున్న రావిరాల రాజు లు ఇద్దరు ఓకె కుటుంబంకు చెందిన వారు.విరు ఈనెల 4న చండూర్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన మారగోని బుచ్చమ్మ బాదితురాలు మధ్యాహ్నం అందాజ 2 గంటల సమయంలో తన చెల్క దగ్గరినుండి ఇంటికి నడ్చుకుంటూ వస్తుండగా గొల్లగూడెం గ్రామంలో బాదితురాలితో ఇడికుడకు దారి ఎటు అని అడుగుతూ మాటల్లో పెట్టి బాదితురాలి మెడలో ఉన్న3 తులాల పుస్తేల తాడును లాక్కొని పారిపోయాడని తెలిపారు. ఈ విషయం పై చండూర్ పోలీసు స్టేషన్ లో బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. నల్లగొండ డిఎస్‌పి కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో చండూర్ సిఐ కె. అది రెడ్డి ఆద్వర్యంలో చండూర్ ఎస్ఐ ఎన్. వెంకన్న,కనగల్ ఎస్ఐ పి. విష్ణు మూర్తి వారి సిబ్బంది నాలుగు టీమ్ లుగా ఏర్పడి కేసును త్వరితగతిన సేదించడం జరిగిందని తెలిపారు. చైన్ స్నాచింగ్ కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను తాస్కానిగూడెం శివారులో వాహనాలు తనికి చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించగా వారిని పట్టుబడి చేసి విచారించగ నేరస్తులు, చెడు వ్యసనాలకు బానిసై కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వలన చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడుతున్నారని. ఆ క్రమంలోనే గొల్లగూడెంలో, అంతకు ముందు వాడపల్లి మండలం కల్లేపల్లి గ్రామ సమీపంలో, పెన్ పహాడ్ మండలంలోని అనాజీపురం, లింగాల, దోసపహాడ్ గ్రామ సమీపంలో, వేములపల్లి మండలం బీరెల్లిగూడెం గ్రామం సమీపంలో, నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామ సమీపంలో, మ్రర్రూరు గ్రామంలో నేరస్తులు ఒక్కోసారి ఒక్కో బైక్ మారుస్తూ మొత్తం 4 మోటార్ సైకిళ్ళ లను ఉపయోగించి ఒంటరిగా వెళ్ళే మహిళలనే టార్గెట్ చేస్తూ వారితో మాటలు కలిపి వారి మెడలో ఉన్న బంగారం పూస్తేల తాడు గొలుసులు లాక్కొని బైక్ పై పారిపోయేవారని, వారు ఒప్పుకోవడం జరిగిందన్నారు. వారి నుండి 19.5 తులాల 08 బంగారు పూస్తేల తాడులు , 2 సెల్ ఫోన్లు దొంగతనం చేయడానికి ఉపయోగించిన 4 మోటార్ సైకిళ్ళ లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ కేసును త్వరగా సేదించిన సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండలంలోని పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించిన కోనాపూర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిర మ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలని, అదే విధంగా పూర్తిచేసిన ఇండ్లకు దశలవారీగా ప్రతి సోమవారం డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతున్నాయని తెలిపారు. ఇసుక అవసరమైన వారు రాజాపేటలోని బేగంపేట నుండి తెచ్చుకోవాలని, సిమెంట్ కూడా కమిటీ నిర్ణయించిన లబ్ధిదారుల కు సూచించారు. ఎంపీడీవో వెంకటే శ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సందీప్ రెడ్డి, మధు నాయక్, చాడ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# నేత్రదానానికి సహకరించాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని పానగల్ ప్రాంతానికి చెందిన బొడ్డు పిచ్చమ్మ శుక్రవారం మృతి చెందారు.ఈ సమాచారం తెలిసిన వెంటనే లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ సభ్యులు వేముల సతీష్ , వీరి కుటుంబ సభ్యులను సంప్రదించి మరణానంతర నేత్ర దానం యొక్క ప్రాముఖ్యతను వివరించగా వారు అంగీకారంతో చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరినాథ్,టెక్నీషియన్ బచ్చలకూర జాని లు నేత్రదాన సేకరణ చేశారు. చైర్మన్ కె.వి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు సేకరించిన 288 కార్నియా అను కంటి పొరల ద్వారా 288 మందికి పైగా కార్నియల్ అంధులకు కంటిచూపును అందించామని తెలిపారు




# పర్యావరణమే ప్రాణికోటికి మూలాధారం

**ప్రజాపక్షం/ చౌటుప్పల్** : పర్యావరణానికి ఆధునిక జీవన విధానం ఆటంకం కాకుండా చూడవలసిన భాధ్యత మనందరిపై ఉన్నదని ఇందుకు చిన్న, పెద్ద అని తేడా లేకుండా అందరూ కృషి చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందనీ శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజిఎం టి.సతీష్ అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల ఆవరణంలో శుక్రవారం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన గ్రీన్‌ఇండియా మిషన్ థీమ్‌లో ముఖ్య అతిథిగా ఏజిఎం టి.సతీష్ పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్, కో ఆర్డినేటర్లు రఘువంశీ, కామేశ్వరి, ప్రీతి, ప్రిన్సిపాల్ శ్వేతా బాన్స్, అకాడమిక్ ఓన్ దుర్గాప్రసాద్, ఏవో గోపిచంద్, ప్రైమరీ ఇంచార్జ్ పరమేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ గుర్తింపు

**ప్రజాపక్షం/భువనగిరి** : రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని ఏఐసీసీ ఇంచార్జ్ ఉమ్మడి నల్గొండ ఇంచార్జ్ డాక్టర్ ఎస్.ఏ సంపత్ కుమార్, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్లా బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందు జిల్లా పార్టీ కార్యాలయం జిల్లా అధ్యక్షుడు ఆడం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఏఐసీసీ ఇంచార్జ్ ఉమ్మడి నల్గొండ ఇంచార్జ్ డాక్టర్ ఎస్.ఏ సంపత్ కుమార్ విచ్చేసిన సందర్భంగా జిల్లా కార్యకర్తలు సంస్థాగత ఎన్నికల ప్రత్యేక సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. . ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్స్ తంగళ్ళపల్లి రవికుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేష్, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేష్, టౌన్ అధ్యక్షుడు కూర వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి సేవాదళ్ పిట్టల బాలరాజ్, గుండాల మాజీ జడ్పిటిసి కొక్కొండ యాదగిరి, యాదాద్రి జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు సామల రవీందర్ పాల్గొన్నారు.

# రక్త పరీక్షలు...డెంగ్యూ, మలేరియాపై అవగాహన



**ప్రజాపక్షం/నందికొండ:** స్థానిక మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ డాక్టర్ నగేష్ ఆధ్వర్యంలో డెంగ్యూ,మలేరియా నివారణ మాసోత్సవం లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు డెంగ్యూ, మలేరియా జ్వరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు 20 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించగా సాధారణ జ్వరంగా నిర్ధారించి మందులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల వసతి గృహాల పరిసరాలను సందర్శించి పరిశీలించి అక్కడ సిబ్బందికి శానిటేషన్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత, నాగార్జునసాగర్ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ సిబ్బంది లింగయ్య, గంగాబాయి, తిరుమల చారి, బీసీ గురుకుల పాఠశాల వైద్య సిబ్బంది నాగమణి,రజని పాల్గొన్నారు.

# విద్యార్థుల చదువుకు ఖర్చు ఎంతైనా తగ్గేదేలే...!

## : ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి




**ప్రజాపక్షం/హాలియా:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రభుత్వంతోపాటు తమ సొంత నిధులను ఎంతైనా ఖర్చు చేస్తానని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. హాలియాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తన సొంత ఖర్చులతో సుమారు రూ.6.50లక్షల విలువచేసే 150 డెస్క్ బెంచీలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు ఎంతో తెలివైన వారని అలాంటివారికి చేయూత నిస్తే ఉన్నత స్థితికి వెళ్తారని తెలిపారు .అనంతరం హాలియాలోని తమ క్యాంపు కార్యాలయంలో జాతీయ ఆహార భద్రత పథకం తోపాటు పోషణ నిర్వహణ పథకం కింద విత్తన కీట్లను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, కర్నాటి లింగారెడ్డి, ఆర్ ఐ ఓ దస్రు నాయక్, ప్రిన్సిపాల్ జకీర్ హుస్సేన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి, ఎడవల్లి నరేందర్ రెడ్డి, కాల సాని చంద్రశేఖర్,గౌని రాజా రమేష్ యాదవ్, వెంపటి శ్రీనివాస్, పిల్లి ఆంజనేయులు, మజహార్, పాండు నాయక్, శి ల్ప, ఆది రెడ్డి అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కృష్ణారెడ్డి మృతదేహానికి ఘన నివాళి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** నార్కట్‌పల్లి మండలం బ్రహ్మణవెల్లెంల గ్రామానికి చెందిన కోమటిరెడ్డి కృష్ణారెడ్డి అనారోగ్యంతో మరణించగా వారి మృతదేహానికి మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం లు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి , మృతదేమ పాడేను కాటి వరకు మోశారు. వారి వెంట నార్కట్‌పల్లి మాజీ జడ్‌పిటిసి దూదిమెట్ల సత్తయ్య యాదవ్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తుల ఉషయ్య,జిల్లా యువజన నాయకులు వడ్డే భూపాల్ రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

# కులవృత్తి దారులు, కళాకారులకు గౌరవ సన్మానం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** భారతీయ జనతా పార్టీ తుర్కపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వ్యాస పూర్ణిమ (గురు పౌర్ణమి) నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మేకల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు గురుపౌర్ణమి సందర్భంగా వివిధ రంగాలలో నిష్ణాతులైన గురువులను, కళాకారులను కులవృత్తి కళాకారులకు గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉన్నదని వాళ్ళ సేవలు ఈ సమాజం ఎప్పటికీ అవసరం అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పోరెడ్డి మాధవీ లత, సుంకరి శివమణి, పండితులు ప్రేమ్ కిశోర్ పండే, ఆన్నోజు సిద్ధిరమాచారి, వడ్రంగి, కుర్రెళ్ళ గురువాచారి, దర్జీ ఆదిమూలం వీరస్వామి, కార్వింగ్ తిప్పరం నగేష్ చారి, స్వర్ణకారులు బ్రహ్మచారి, గాయకులు కలాషికం జగదీష్, కుర్రెళ్ల సందీప్ చారి, డప్పు కళాకారులు ఎల్లయ్యలను ఘనంగా సత్కరించారు.

# నాణ్యత ప్రమాణాలు పెరగాలి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** భవిష్యత్తుకు పునాది డిగ్రీ మొదలుకొని ఉపాధి అవకాశాలు సైతం డిగ్రీతో సాధ్యమైతున్నందున డిగ్రీ బోధనలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ పునరుద్ఘాటించారు. శుక్రవారం యూనివర్సిటి లో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌లతో, ఆడిట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దోస్త్ అనంతరం డిగ్రీ కళాశాలలో ఆడ్మిషన్లు, సిలబస్ వంటి అంశాలపై చర్చించారు. 20శాతం కన్నా తక్కువ అడ్మిషన్లు ఉన్న కోర్సులను వేరే విద్యాలయాలకు బదిలీ చేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతి డిగ్రీ కళాశాల ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని సామాజిక అంశాలపై దృష్టి కేంద్రికరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ఆడిట్ సెల్ డైరెక్టర్ డా ఎం జయంతి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్లు పాల్గోన్నారు.

# అంతర కృషితో పంటకు లాభం

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** పంట వేసిన 40 రోజుల వరకు పొలంలో ఎలాంటి గడ్డి మొక్కలు కలుపు మొక్కలు లేకుండా నివారణ చర్యలు చేపట్టినట్లయితే అధిక దిగుబడి సాధించవచ్చని జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ అధికారి సక్రి నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని తక్కశిల మారము నగాల ఉండవెల్లి కంచుపాడు గ్రామాలను సందర్శించి వానాకాలంలో సీజన్లో సాగు కు అయిన పత్తి మొక్కజొన్న కంది తదితర పంటలు పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఏ బూడిదపాడు గ్రామంలో రైతు సురేష్ రెడ్డి సాగు చేసిన పత్తి పంటను పరిశీలించి సకాలంలో అంతర కృషి వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించడం జరిగింది. రైతులు వేసిన పంటలను సకాలంలో పిచికారి చేసి సరైన మోతాదులో ఎరువులు వాడే అధిక దిగుబడిలో సాధించేందుకు సంబంధిత వ్యవసాయ అధికారులను కలపాలని వారు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# జిపి పనులను త్వరలో పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** ఉండవెల్లి మండల పరిధిలోని మారమునగాల టు గ్రామ పంచాయితీ భవన నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేయాలని జోగులమ్మ గద్వాల జిల్లా డిఆర్ డిఏ అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు అన్నారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పంచాయితీ పనులను త్వరలో పూర్తి చేయాలని కాంట్రాక్టుకు అధికారులకు ఆదేశించారు. గ్రామానికి ముస్లింలకు ఈద్గా మసీదు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. అనంతరం ప్లాంటేషన్ మొక్కల నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాఠశాలను కాపాడాల్సిన బాధ్యత గ్రామస్తుల పైన ఉన్నదని పేర్కొన్నారు. విద్యార్థులను పెంచే విధంగా చూడాలని అధికారులకు స్థానికులకు సూచించారు. పాఠశాల విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలను పరిశీలించి 60 మంది విద్యార్థులు ఉన్నట్లు ఉపాధ్యాయులు నలుగురు ఉన్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ పేర్కొన్నారు. గ్రామంలోనూ మొక్కలు ఎన్నో ఉన్నట్లు టార్గెట్ రీచా చేయాలని వారు తెలిపారు. పరిశుభ్రత గ్రామాల్లోను ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలోనూ అంగన్వాడి సెంటర్లకు భవనాలు లేవని, పాఠశాలలో పిచ్చి మొక్కలు పెరగడం వలన ఇబ్బందిగా మారిందని, వర్షం వచ్చినప్పుడు పాఠశాల ఆవరణంలో మురికి నీళ్లు చేరుతాయని వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమస్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ నాగేంద్ర, ఎంపీడీవో తిరుపతయ్య, ఏపీవో సమ, టెక్నికల్ అసిస్టెంట్లు స్థానిక అధికారులు పాల్గొన్నారు.





# బిసిలకు 42శాతం రిజర్వేషన్ పట్ల హర్షం

**ప్రజాపక్షం/డిండి;** 2023 సాధారణ ఎన్నికల్లో బిసిలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల ఆర్డినెన్స్ తెచ్చినందుకు శుక్రవారం యువజన కాంగ్రెస్ డిండి మండల అధ్యక్షుడు గడ్డమీది సాయి ఆద్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు రాములు, కాశన్న, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, ఖలీం, ఉమర్, ఖయ్యూమ్, సలీం, శ్రీనివాసులు, సాయిబాబు, పర్వతాలు, వేణుగోపాల్, షబ్బీర్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ ప్రకటించడం పట్ల టీడీపీ పట్టణ అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చవల వెంకటేశ్వర్లు, గర్దాస్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం కోసం క్యాబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, ఎంఎల్‌ఏ బాలునాయక్ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కైసర్‌ఖాన్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, నాయిని మాధవరెడ్డి, బొడ్డుపల్లి సైదులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** బిసిలకు 42శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లో కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ఉంద్రుగొండ గిరిదుర్గం చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిమ్మల వెంకన్న, వెలుగు వెంకన్న, పిల్లల రమేష్‌నాయుడు, తండు శ్రీనివాస్, జ్యోతి కరుణాకర్, నేరేళ్ల మధు, శ్రీధర్, ధర్మ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ ఎర్రవల్లి మండల పరిధిలోని పూటన్ దొడ్డి గ్రామంలో ముఖ్యమంత్రి , ఎఐసిసి కార్యదర్శి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఆర్ బాబు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు వడ్డే ఈధన్న , కృష్ణ, గ్రామ పెద్దలు, చిన్న దుబ్బన్న ,దేవన్న, భూపాలం బ్యాండ్ కృష్ణ , పల్లెపాడు కృష్ణ, వెంకట్ రాములు, గోపాల్ పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలు.. గోడౌన్‌ల తనిఖీ

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఎరువుల క్రయ, విక్రయాలలో కృత్రిమ కొరత సృష్టించినా, లింక్ పద్ధతిలో క్రయ, విక్రయాలు జరిపినా కఠినచర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి వై. శ్రీనివాసరావు డిల్లరను హెచ్చరించారు. పట్టణంలో ఆయిల్ ఫామ్ రైతు సంఘం నాయకులు మలిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి స్థానికంగా ఒక ఎరువుల దుకాణంలో మ్యూరిట్ ఆఫ్ పోటాష్ (ఎంఓపి) కొనుగోలు నిమిత్తం దుకాణ యజమానిని సంప్రదించగా, స్టాక్ లేదని చేప్పారని వారి ఫిర్యాదు మేరకు పట్టణంలో పలు ఎరువుల దుకాణలు, వాటికి సంబంధించిన గోదాములను శుక్రవారం తనిఖీ నిర్వహించి, డీల్లరకు కఠిన అదేశాలు జారీ చేశారు. అనంతరం వ్యవసాయాధికారి మట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎరువులు కోరతే లేదని, ప్రస్తుతం మండలంలో సుమారు 170 టన్నుల యారియా, 140 టన్నులు పోటాష్ (ఎంఓపి), 130 టన్నులు డిఏపి, 500 టన్నుల మిశ్రమ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, డీలర్లు ఎవరు కూడా స్టాక్ ఉంచుకొని లేదు అని చెప్పినా, లింక్ పద్దతిలో ఎరువుల విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎరవుల కోరత, క్రయవిక్రయాలపై ఏమైన ఫిర్యాధులు ఉంటే ఈ దిగువ నంబర్లకు, రైతులు సంపందించాలని తెలిపారు.



వై. శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి 8977748723, డి నరేష్, వ్యవసాయ విస్తరణాధికారి, 92810 36987 (సత్తుపల్లి), కె.ఆశాజ్యోతి వ్యవసాయ విస్తరణాధికారి (తుంబూరు), 9281036988, అనూష వ్యవసాయ విస్తరణ అధిగారి, 9281036986 (కాకర్లపల్లి) సాయి వసంతి వ్యవసాయ విస్తరణ అధికారి 9281036985 విస్తరణాధికారి (బేతుపల్లి).

# బీసీ ఉద్యమాల ప్రతిఫలమే క్యాబినెట్ నిర్ణయం

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని వేంసూరు రోడ్డులో గల జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, సిపిఐ పార్టీ నాయకులు దండు ఆదినారాయణలు పాల్గొని మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా బీసీ సంఘాలు చేస్తున్న ఉద్యమాల ఫలితంగానే నేడు కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ యొక్క నిర్ణయాన్ని తీసుకుందని వారు తెలిపారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకోవటం బీసీ సంఘాలుగా స్వాగతిస్తున్నామని, తెలంగాణ బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడు రుణపడి ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు. అనంతరం బీసీ సంఘ కార్యాలయం ముందు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చల్లారి వెంకటేశ్వరరావు, చింతలపాటి సత్యనారాయణ, తోట సుజలా రాణి, కమల్ పాషా, దూదిపాల రాంబాబు, నాగుల్ మీరా, కంటే అప్పారావు, వినుకొండ కృష్ణ, విరివాడ నాగభూషణం, టోపీ శ్రీను, షరీఫ్, దుస్సా వెంకటేశ్వర్లు, కర్రీ కమలాకర్, మల్లెల శ్రీనివాస్, పామర్తి నాగేశ్వరావు, మార్బుల్ రామ కృష్ణ, మరీదు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన కర్రె రామకృష్ణ పెద్ద కుమారుడు కర్రె హరేంద్ర మరణించారు. వారి కుటుంబ సభ్యులకి (ఏజెఆర్ ఫౌండేషన్) ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో రూ.5000 అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గ్రామ యువత పాల్గొన్నారు.

# పిఆర్‌టియుతోనే సాధ్యం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని సంఘం మండల అధ్యక్షుడు మునగాల రాంరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీపార్క్ పాఠశాలతోపాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుంటుందన్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పీఆర్‌టీయూ సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుత్తికొండ సుందర్శన్, కందిమళ్ల వెంకట్‌రెడ్డి, అనుముల సైదిరెడ్డి, లక్ష్మి , సైదిరెడ్డి, మచ్చ రఘు, ఫిరోజ్, శ్రీనివాస్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు



**-చిరకాల కోరిక తీరినందుకు లబ్దిదారుల ఆనందం**

**-డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించిన జిల్లా కలెక్టర్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పారదర్శకంగా లబ్దిదారులకు కంప్యూటర్ ద్వారా ర్యాండమైజేషన్ పద్ధతిలో డబుల్‌బెడ్‌రూం ఇండ్లను కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం యాతాలకుంట, రేజర్ల, పినపాకలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్దిదారులకు అలాట్‌మెంట్ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. పైరవీలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఇండ్ల కేటాయింపు జరిగిందన్నారు. 67 డబుల్‌బెడ్‌రూం ఇండ్లను లబ్దిదారులకు కంప్యూటర్ ర్యాండమైజేషన్ పద్ధతిలో పారదర్శకంగా కేటాయించామన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు పట్టాలను త్వరలోనే సత్తుపల్లి ఎంఎల్ఏ ఆధ్వర్యంలో మంత్రి చేతుల మీదుగా అందిస్తామన్నారు. సత్తుపల్లి నియోజక వర్గంలోని యాతాలకుంటలో 40, రేజర్లలో 20, పినపాకలో ఏడు మొత్తం 67 ఇండ్లను గ్రామసభ ద్వారా ఎంపిక చేసిన లబ్దిదారులకు ర్యాండమైజేషన్ పద్ధతిలో ఇండ్లను కేటాయించామన్నారు. ఈ జాబితాను గ్రామంలో ప్రదర్శిస్తామని జిల్లా వెబ్‌సైట్‌లో కూడా పెట్టడం జరుగుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా కలగా ఉన్న సొంతింటిని జిల్లా కలెక్టర్‌గా వచ్చిన నెల రోజుల్లోనే సాహకారం చేశారని సంతోషంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, డబుల్‌బెడ్‌రూం ఇండ్ల లబ్దిదారులు, అధికారులు పాల్గొన్నారు.

# వెంకటరెడ్డి మృతి సిపిఐకి తీరని లోటు

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు**

**ప్రజాపక్షం/చింతకాని :** సీపిఐ సీనియర్ నాయకులు ఆవులూరి వెంకటరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు పేర్కొన్నారు. కోమట్లగూడెం గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు ఆవులూరి వెంకటరెడ్డి(76) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు కోమట్లగూడెం చేరుకొని వెంకటరెడ్డి మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈసందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ వెంకటరెడ్డి కోమట్లగూడెం గ్రామంలో పార్టీ ఎదుగుదలకు ఎంతో కృషిచేశాడని బ్రతికినంత కాలం నిబద్ధత గల కమ్యునిస్టుగా బ్రతికాడన్నారు. వెంకటరెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సమితి సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి



గోపాలరావు, నాయకులు వేముల జానకిరాములు, షేక్ జానిమియా, చాట్ల రమేష్, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి తిరపతమ్మ తదితరులు ఉన్నారు.

# నానో యూరియాతో అధిక ప్రయోజనం

**ప్రజాపక్షం/చింతకాని :** నానో యూరియా వాడకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడిఏ స్వర్ణ విజయచంద్ర రైతులకు సూచించారు.మండల పరిధిలోని నాగులవంచ, మత్కేపల్లి గ్రామల్లో వ్యవసాయ పంట పొలాలను పరిశీలించి నానో యూరియా వాడకం వల్ల కలుగు ప్రయోజనాలను రైతులకు వివరించారు.నానో యూరియా వాడకం వల్ల మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని, పర్యావరణ కాలుష్యం తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. నానో యూరియాను ఎంపిక చేసిన కలుపు మందులతో కలిపి పిచికారి చేయవచ్చని రైతులకు వివరించారు. నాగులవంచ గ్రామంలో పచ్చిరొట్ట పంటలైన జీలుగు, జనుమును పరిశీలించి రైతులకు పలు పచ్చిరొట్టల వల్ల కలుగు ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిని ఎస్ మానస,





ఏఈవోలు కల్యాణి, కార్తీక్, రైతులు తన్నీరు పుల్లారావు, తాళ్లూరి రమేష్, బందెల నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య తెలంగాణనే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/చింతకాని :** ఆరోగ్య తెలంగాణనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చింతకాని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మండలపరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్దిదారులకు రూ.80 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు.తమకు చెక్కులు మంజూరీకి కృషిచేసిన ఉపముఖ్య మంత్రి మల్లుభట్టి విక్రమార్క కు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలస్యం బసవయ్య, దేవాలయ కమిటీ మెంబర్ ఎల్లంపల్లి చిన్న అప్పారావు, వెచ్చా మంగపతి రావు, ముత్తినేని వెంకటేశ్వర్లు, నెల్లూరి రమేష్, ఆలస్యం శంకర్, షేక్ సోందు పాల్గొన్నారు.

# తూతూమంత్రంగా జంగిల్ క్లీనింగ్





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి నుంచి ప్రారంభమై ఎన్‌ఎస్‌పీ కాలువ ఇరువైపులా జరుగుతున్న జంగిల్ క్లీనింగ్ తూతూత మంత్రంగా సాగుతోంది. ఓ అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంతో చేసిన పనులే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నిబంధనల విరుద్ధంగా ఇరువైపులా జంగిల్‌ని తొలగించి అక్కడే వదిలేస్తున్నారు. అంతేకాకుంఆ వేర్లతో సహా పెకిలించాల్సి ఉన్నప్పటికీ పైపైనే విరగ్గొడుతున్నారు. ఇలా చేయడం వలన మరల వృక్షాలు పెరిగే అవకాశం లేకపోలేదు. ఆ చెట్లను సైతం అక్కడే వదిలేస్తున్న తీరు నిర్లక్ష్య పనితీరుకు అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో లక్షల రూపాయాలు వెచ్చించిన ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు అవుతోందని, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ పనులపై అధికారుల పర్యవేక్షన చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం శోచనీయం, ఇప్పటికైన అధికారులు పర్యవేక్షణ చేసి తప్పుడు పనులపై చర్యలు తీసుకోవాలనే వాదనలు వినిపిస్తున్నాయి. చేపట్టబోవు పనులను పకడ్బందీగా జరిగేలా చూడాలని పేర్కొంటున్నారు.

# స్మార్ట్‌కిడ్జ్‌లో వన మహోత్సవం





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పర్యావరణాన్ని పరిరక్షించాలని, కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలని సందేశమిస్తూ ఖమ్మం స్మార్ట్‌కిడ్జ్ చిన్నారులు వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో, మైదానంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా విద్యార్థులు మొక్కలు నాటారు. సేకరించిన వివిధ రకాల మొక్కలను స్వయంగా విద్యార్థులు గుంతలు తీసి మొక్కలు నాటారు. అనంతరం స్కూల్ సమీపంలోని వీధుల్లో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని వన మహోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ మానవులతో పాటు అన్ని జీవులు ప్రాణవాయువుతోనే జీవనం కొనసాగిస్తాయన్నారు. ఆ ప్రాణవాయువు మనకు చెట్ల ద్వారానే వస్తుందని అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పాఠశాల విద్యార్థులు పుట్టిన రోజు సందర్భంగా తప్పనిసరిగా ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన ప్రాంతీయ ఇంటిలిజెన్స్ అధికారి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ప్రాంతీయ ఇంటిలిజెన్స్ అధికారి (ఉమ్మడి ఖమ్మం జిల్లా) రామోజీ రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ప్రాంతీయ ఇంటిలిజెన్స్ అధికారి రామోజీ రమేష్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఇంటిలిజెన్స్ డిఎస్‌పి వెంకన్నబాబు, భద్రాద్రి కొత్తగూడెం ఇంటిలిజెన్స్ డిఎస్‌పిపి చలువాది శ్రీనివాసరావు, వైవి ప్రసాద్, జోనల్ ఇన్‌స్పెక్టర్స్, ఖమ్మం హరిసింగ్, జెడ్ ఎస్ఐ భద్రాద్రి కొత్తగూడెం శ్రీనివాసరావు, ఎఎస్ఐ విజయ్, హెచ్‌సిలు తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్‌ను కలిసిన ఆసుపత్రి సూపరింటెండెంట్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం. సురేందర్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేందర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి, పలువురు వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగుల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దివ్యాంగులకు ఉపాధి పునరావాసం పథకం క్రింద రుణాల మంజూరు కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి, మహిళా శిశు వికలాంగుల వయో వృద్దుల సంక్షేమ శాఖాధికారి కె . రాంగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 50వేల యూనిట్లు 25, లక్ష యూనిట్ ఒకటి, రెండు లక్షల యూనిట్ ఒకటి, మూడు లక్షల యూనిట్ ఒకటి మొత్తం 2 యూనిట్లు జిల్లాకు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈనెల 14 నుండి 31 వరకు దరఖాస్తులను http//tgobmms.cgg.gov.in నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# సిపిఐ తిరుమలాయపాలెం మండల మహాసభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తిరుమలాయపాలెం మండల మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో శనివారం ఉదయం 9గంటలకు మండల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కొక్కిరేణి గ్రామంతా ఎర్ర తోరణాలతో స్వాగతం పలుకుతుందని తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర రైతు సంఘం నాయకులు మహమ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు దండి సురేష్, జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు దంతాల బాలరాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు. మండల సిపిఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

